క్లుప్తంగా

27న గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 27వ తేదీన అరుణాచల గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం పి.శివాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ 27న మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి 28న ఉదయం కాణిపాకం ఆలయం, మధ్యాహ్నం శ్రీపురం శ్రీమహాలక్ష్మీ అమ్మవారి దర్శనం తర్వాత సాయంత్రం గిరిప్రదక్షిణ, స్వామివారి దర్శనం నిమిత్తం ఆరుణాచలం చేరుకుంటుందన్నారు. 29న ఉదయం కంచి, సాయంత్రం శ్రీకాళహస్తి ఆలయాల దర్శనం అనంతరం తిరిగి బయలుదేరి 30వ తేదీ ఉదయం 8 గంటలకు గన్నవరం చేరుకుంటుంది. పుష్‌బ్యాక్ సదుపాయం కలిగిన సూపర్ లగ్జరీ బస్సు ప్రయాణ టిక్కెట్ ధరను రూ.3 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం 87909 96090, 73829 05633 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర యోగా పోటీలకు ఎంపిక



రామవరప్పాడు : త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటలకు ఎంపికైన విద్యార్థులను స్థానిక రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం తాయారు మాట్లాడుతూ ఈనెల 12న పటమట జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా యోగా సెలక్షన్స్‌లో పాఠశాల విద్యార్థులు పాల్గొని అండర్-14 విభాగంలో సంజన, సాయి ఉదయ్, అండర్-17 విభాగంలో వేముల వెంకట సాయి కుమార్‌లు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల, పుష్పరాణి, జగదీశ్వరి, యోగా టీచర్ పార్వతి, ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలియజేశారు.

ఉత్సాహంగా అమృత్ కలష్ యాత్ర



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం అమృత్ కలష్ యాత్ర ఘనంగా నిర్వహించారు. మేరీ మిట్టి మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌లు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి సుంకరరాము, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, వినోద్ పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలి



ఉయ్యూరు: ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపట్టాలని ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. బోళ్లపాడు గ్రామంలో వరి పొలాల్లో ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ఎలుకల దాడిలో పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రైతులు సమష్టిగా, సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, జిల్లా వనరుల కేంద్రం అధికారి జ్యోతి రమణి, ఏడీఏ శ్రీనివాసరావు, గన్నవరం ఏడీఏ ఎం.సునీల్, ఏఓ బి.నిస్సిగ్రేస్, వీఏఏ డి.రఘు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు

పెనమలూరు: గంగూరు గ్రామంలో వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు మహిళా మండలి కట్టకు చెందిన శీలం విజయ్‌బాబు కుటుంబ సభ్యులతో ఉంటూ రాడ్‌బెండింగ్ పనులు చేస్తాడు. అతను గతంలో ఇంటి సమీపంలో ఉంటున్న కొక్కిలిగడ్డ మహేష్, అతని తండ్రి నాగేశ్వరరావు కలిసి రూ.9 వేలు విజయ్‌బాబుకు ఇవ్వాలని ఈ నేపథ్యంలో విజయ్‌బాబు గురువారం మహేష్, నాగేశ్వరరావును సొమ్ము అడిగాడు. తమనే డబ్బు అడుగుతావా అంటూ ఇద్దరు వ్యక్తులు రాడ్‌తో విజయ్‌బాబుపై దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన విజయ్‌బాబును విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



మానికొండలో మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సరోజిని



సావరగూడెంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రవి, జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, సర్పంచ్

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలకు వరమని తాడిగడప మునిసిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ కె.అభినేష్ అన్నారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఇంటికి సర్వే నిర్వహించి ఆరోగ్య వివరాలు సేకరించి వైద్య శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రవి కుమార్, సొసైటీ అధ్యక్షుడు మంచినేని పరమేష్, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమోతు జీవన్, తెన్నేటి ప్రకాష్, ఆకునూరు సుబ్బారావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం..

ఉంగుటూరు: ప్రజల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. మానికొండలో ఎంపీపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో 824 మందికి వివిధ విభాగల డాక్టర్లు వి.సుబ్బారావు, టి.అఖీల్ తేజ, కె.వాణి, సీహెచ్ సుగుణావతి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిమ్మకూరి స్వర్ణలత, వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, ఎంపీటీసీ ముత్తయ్య, గన్నవరం మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ రామిశెట్టి అంజిని కుమారి, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ వనజాక్షి, ఈవోఆర్‌డీ బాషా, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గోగనేని వెంకటేశ్వరరావు(బాబు), మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చింతయ్య పాల్గొన్నారు.

430 మందికి వైద్య పరీక్షలు

గన్నవరం రూరల్: మండలంలోని సావరగూడెం ఎంపీపీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. అనంతరం జరిగిన సభకు సావరగూడెం సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు, జక్కులనెక్కలం సర్పంచ్ మాకుల చిరంజీవిలు అధ్యక్షత వహించారు. మొదట వైద్య శిబిరాన్ని ఎంపీపీ రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి, సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీడీవో సత్యకుమార్, వైద్యాధికారి శివ ప్రసాద్‌లతో కలసి ప్రారంభించారు. శిబిరంలో జనరల్, గైనిక్, కళ్లు, గుండె, ఆర్థో వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి మందులు అందజేశారు. రిఫరల్ కేసులను పలు ఆస్పత్రులకు పంపారు. పీఆర్‌ఏఈ దాసు, మండల కో ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, సచివాలయం కార్యదర్శి బెజవాడ చైతన్య, సచివాలయం కన్వీనర్‌లు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. శిబిరంలో 430 మంది పాల్గొనగా వారిలో 161 మంది మహిళలు వైద్య సేవలు పొందారు.

సద్వినియోగం చేసుకోండి..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని శ్రీ చింతా సీతయ్య జూనియర్ కాలేజి ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సర్పంచ్ పల్లపోతు జాన్‌ప్రకాష్ ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బాపులపాడు వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష నేతృత్వంలోని వైద్యుల బృందం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, రక్తపోటు, మధుమేహం, గైనకాలజీ వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. వైద్యశిబిరంలో 572 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ పండు రాణి, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకట రమణ, ఉప సర్పంచ్ మజ్జి దీవెనకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పండు నాగార్జున పాల్గొన్నారు.



పోరంకిలో పేదలకు మందులు అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అభినేష్



పెరికీడులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

దసరాకు ఆలయాలు ముస్తాబు

కంకిపాడు: దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 15వ తేదీ నుంచి దసరా నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఇందుకుగానూ మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాలు, ప్రధాన కూడళ్లలో ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహక ప్రతినిధులు, భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. కంకిపాడు శివాలయం, ప్రొద్దుటూరు, ఈడుపుగల్లు, మద్దూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు నవరాత్రుల్లో వివిధ రూపాల్లో భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కంకిపాడు శివాలయం వద్ద క్యూలైన్లను సిద్ధం చేశారు. భక్తులకు అసౌకర్యం వాటిల్లకుండా దేవదాయశాఖ, ఉత్సవ కమిటీల పర్యవేక్షణలో దసరా ఉత్సవ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి.

ఘనంగా ముందస్తు దసరా ఉత్సవాలు

గన్నవరం: స్థానిక శ్రీప్రజ్ఞ పాఠశాలలో శుక్రవారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్ని నవదుర్గల నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పండుగ విశిష్టతను పాఠశాల డైరెక్టర్ సూరి పవన్‌కుమార్ వివరించారు. పాఠశాల ఎగ్జిక్యూటీవ్ సభ్యులు బైరి రంజిత్‌కుమార్, హెచ్‌ఎం శైలజరాజ రాజేశ్వరి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కంకిపాడు శివాలయం వద్ద సిద్ధమైన క్యూలైన్లు



దసరా వేడుకల్లో విద్యార్థులు

గంగూరు-నందమూరు విద్యుత్ లైన్‌కు మరమ్మతులు

కంకిపాడు: జంపర్ తెగిపోవటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిన మరమ్మతులు నిర్వహించారు. మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్ పునరుద్ధరణ చర్యలు తీసుకున్నారు. గంగూరు నుంచి నందమూరు వెళ్లే ఫీడర్ 132 కేవీ విద్యుత్ లైన్ జంపర్ కంకిపాడు వద్ద తెగిపోయింది. కంకిపాడు, ఉయ్యూరు పరిసరాల్లో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో సమస్యను గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఫీడర్‌ల ద్వారా ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా చేశారు. కంకిపాడు వద్ద జంపర్ తెగిపోయిన ప్రాంతంలో కంకిపాడు, ఉయ్యూరు రూరల్ విద్యుత్‌సిబ్బంది అత్యవసర మరమ్మతులు నిర్వహించారు. జంపర్ మరమ్మతులు చేసి, కంకిపాడు పట్టణం, రూరల్ ఫీడర్‌లకు కూడా విద్యుత్ పునరుద్ధరణ చేశారు. మరమ్మతులను కంకిపాడు ఏఈ తాళ్లూరి అశోక్‌కుమార్, ఉయ్యూరు రూరల్ ఏఈ సత్యనారాయణ పర్యవేక్షించారు.



కంకిపాడు వద్ద జంపర్ తెగిపోవటంతో మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

మేలైన యాజమాన్య చర్యలతో ఎలుకల నిర్మూలన

జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి

కంకిపాడు: మేలైన యాజమాన్య చర్యలతో ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుందని జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి అన్నారు. మండలంలోని పునాదిపాడు రైతుభరోసా కేంద్రం వద్ద రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలుకల నిర్మూలనకు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి మాట్లాడుతూ ఎలుకల సమస్యను ఎదుర్కొనేందుకు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలన్నారు. నూరుశాతం రాయితీపై అందిస్తున్న బ్రోమోడయోలిన్ మందును ఉపయోగించి విషపు ఎర తయారు చేసి పంట పొలంలో వేసుకోవాలన్నారు. 96 పాళ్లు నూకలు, రెండు పాళ్లు బ్రోమోడయోలిన్ మందు, రెండు పాళ్లు నూనెతో విషపు ఎర తయారు చేసుకోవాలని సూచించారు. 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి పంట పొలంలో ఎలుకల బొరియల వద్ద ఉంచటం ద్వారా ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో పామర్రు ఏడీఏ స్వర్ణలత, మండల వ్యవసాయాధికారి పి.మాధురీకిరణ్, మాజీ సర్పంచ్ ముసిబోయిన వెంకటేశ్వరరావు, వీఏఏ కె.పావని, రైతులు పాల్గొన్నారు.



పునాదిపాడు ఆర్‌బీకే వద్ద రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న పద్మావతి

భార్య ఫిర్యాదుతో భర్తపై కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గ్రామం మసీదు సెంటర్‌కు చెందిన షేక్ ఉస్సేన్‌బీ పదకొండేళ్ల క్రితం రెహమతుల్లాను వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. భర్త ఆటోనగర్‌లో టింకరింగ్ పనులు చేస్తాడు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారి అదనపు కట్నం తీసుకురమ్మని భార్యను వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు భర్త పై కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శుక్రవారం మాసశివరాత్రి పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకరుద్రాభిషేకం, స్వామివారికి విశేష అలంకరణ అనంతరం పల్లకీలో ఊరేగించి శివసాధంలో కల్యాణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీవీఆర్ సాగర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చంద్రమౌళీశ్వరునికి ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చినకంచిలో మాసశివరాత్రి ప్రదోష సమయంలో శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దర్శనం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చినకంచిలో చండీ హోమం నిర్వహించారు. పంచహోమాలతో హారతులిచ్చారు. వేదస్వస్తి నిర్వహించిన పిమ్మట అన్నసంతర్పణ చేశారు. దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు.

వివాహిత అదృశ్యం

పెనమలూరు: వివాహిత అదృశ్యం కావటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం నిడమానూరుకు చెందిన శిరీష భర్త వెంకయ్యతో నిడమానూరులో ఉంటుంది. ఆమె కానూరు కొత్త ఆటోనగర్‌లో పని చేస్తుంది. ఈ నెల 8వ తేదీన పనికని ఆటోనగర్‌కు వెళ్లిన శిరీష తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆమె జాడ తెలియక పోవటంతో శిరీష తల్లి చాట్ల గ్రేసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం తెలిపారు. గన్నవరం మొత్తం ఏరియాతో పాటు మర్లపాలెం, చిన్నఅవుటపల్లి, దావాజిగూడెం, అల్లాపురం, రాజీవ్‌నగర్, ఎస్టీబీఎల్ కాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, బీబీ.గూడెం, గొల్లనపల్లి, చిక్కవరం గ్రామాల్లో విద్యుత్ ఉండదని చెప్పారు.

- పెనమలూరు: కానూరులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ మహదేవపురం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా సనత్‌నగర్, తులసీనగర్, బందరు రోడ్డు, టీచర్స్‌కాలనీ, గౌరీశంకర్‌నగర్, మురళీనగర్, జేఆర్‌డీ టాటా ఎస్టేట్‌లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.
- హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని ఆరుగొలను, కొత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సీపీడీసీఎల్ గుడివాడ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరుగొలను, కొత్తపల్లిలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి

కంకిపాడు: రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ చాట్ల విజయ్‌బాబు అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో వ్యవసాయసలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ శాఖల పనితీరు, రైతుల నుంచి వస్తున్న సమస్యలపై సమీక్ష చేశారు. విజయ్‌బాబు మాట్లాడుతూ సాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఇరిగేషన్ సెక్షన్ వద్ద నీటి మట్టం నిర్వహించటం ద్వారా కంకిపాడు, కోమటిగుంట రెగ్యులేటర్లకు ఎగువున ఉన్న గ్రామాల్లో పంట పొలాలకు సమృద్ధిగా సాగునీరు అందుతుందన్నారు. నీరు అందక రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం సేకరణకు సమాయత్తం కావాలన్నారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీ సమర్థంగా పూర్తి చేసి, ధాన్యం సేకరణలో అవరోధాలు తలెత్తకుండా చూడాలన్నారు. ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో ఈఓఆర్‌డీ పీవీఎస్ మైథిలి, ఏఓ పి.మాధురీకిరణ్, ఆర్‌ఐ రాఘవరావు, అగ్రిబోర్డు డైరెక్టర్లు నకరికంటి శేఖర్, సాగి కోటేశ్వరరావు, త్రినాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, పక్కన ఎంపీపీ రాజ్యలక్ష్మి తదితరులు

ధాన్యం కొనుగోలుకు ముందస్తు చర్యలు అవసరం

నున్న(విజయవాడరూరల్): ఖరీఫ్ సీజనులో ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని చర్యలు ముందుగానే తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం నున్న రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో గోనే సంచులు, ధాన్యం తూకం వేసే వేయింగ్ మిషన్లు, టార్పాలిన్లు లాంటివి ఏర్పాటు చేయాలన్నారు. అసిస్టెంటు డైరెక్టర్ బి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ రైతులు సమావేశాల్లో అడిగిన ప్రతి సమస్యను పరిష్కరించామన్నారు. వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు చేయడం పూర్తి చేశామని, ఈకేవైసీ కూడా దాదాపు పూర్తయ్యిందన్నారు. నున్న సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సరఫరాను నిరంతరం ఇస్తున్నామని ఏఈ రాజశేఖర్ అన్నారు. పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని పశువైద్యాధికారి ప్రసన్న తెలిపారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు పోలారెడ్డి చంద్రారెడ్డి, డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, ఉద్యానశాఖాధికారి పరమేశ్వరరెడ్డి, ఏఈఓ విజయకుమార్, సురేష్ రైతులు పాల్గొన్నారు. సామూహిక ఎలుకల నివారణ మందును తయారు చేసి రైతులకు అందజేశారు.



మాట్లాడుతున్న నాగిరెడ్డి

గ్రామాల్లో శరవేగంగా మౌలిక వసతుల కల్పన

ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం, మండల పరిషత్, పంచాయతీ సాధారణ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. అభివృద్ధి పనులు జరుగుతున్న తీరు, పనుల నాణ్యత తనిఖీ చేశారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణపరమైన లోపాలు లేకుండా అభివృద్ధి పనులు సమర్థంగా పూర్తి చేయాలన్నారు. నిధులు సద్వినియోగం అయ్యేలా, వసతుల కల్పన జరిగేలా చూడాలని సూచించారు. పరిశీలనలో సర్పంచ్ వీరంకి వెంకటరమణ, ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ పటాకుల శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మంతెనలో నిర్మిస్తున్న సిమెంటు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

సాంకేతిక ప్రరిజ్ఞానంపై అవగాహన అవసరం

రామవరప్పాడు : రోజు రోజుకీ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం విద్యార్థులపై ఉందని సైటిక్ హబ్ ప్రతినిధి విఠల్ రాజారాం అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో 'మ్యాట్ ల్యాబ్'-సిములింక్' అంశంపై గత మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విఠల్ రాజారాం నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అనంతరం మ్యాట్‌ల్యాబ్ ప్రోగ్రామింగ్, సిములింక్ మోడల్స్, ఇమేజ్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్ టూల్స్ బాక్స్‌ల గురించి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు, ఈసీఈ విభాగాధిపతి శ్రీ గౌరి పాల్గొన్నారు.

ఎస్సార్కేలో అమృత్ కలష్ యాత్ర

ప్రధాన మంత్రి నరేంద్రమోది పిలుపు మేరకు ఎస్సార్కే కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అమృత్ కలష్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తమ సొంత గ్రామాల నుంచి బియ్యం, మట్టిని సేకరించి యాత్ర నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంతో నాణ్యమైన విద్య

పెనమలూరు: జాతీయ విద్యా విధానంతోనే నాణ్యమైన విద్య అమలు జరుగుతుందని ఎయిమ్స్ సదరన్ రీజినల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం జాతీయ విద్యా విధానం 2020 (ఎన్ఈపీ2020)ఉన్నత విద్యలో అమలు సవాళ్లు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎయిమ్స్ సదరన్ రీజినల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం విశిష్టతను వివరించారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పార్థబట్టాచార్జీ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ వి.నరసింహారావు, ప్రొఫెసర్ డాక్టర్ టి.శ్రీనివాస్, ప్రొఫెసర్ రాజేష్‌చౌదరి, రిచి శుక్లా, పి.శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రతినిధులు

దాత సహకారంతో ఆటస్థలం చదును

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నున్న గ్రామానికి చెందిన రైతు గుంటక సుబ్బారెడ్డి ముందుకు వచ్చారు. గత కొంత కాలంగా హ్యాండ్‌బాల్ కోర్టు విద్యార్థులు ఆడుకొనేందుకు వీలులేక జమ్మి దట్టంగా పెరిగింది. ఆ కోర్టును ఆడుకునేందుకు వీలుగా డోజర్‌తో చదును చేయడం జరిగింది. తాను చదువుకున్న పాఠశాలలో క్రీడాభివృద్ధికి తాను భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. సుబ్బారెడ్డి దాతృత్వానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు విజయవర్మ, శ్రీలత ధన్యవాదాలు తెలిపారు.